
పాలితుల సౌకర్యాలకు, వారి కనీసావసరాలు తీరేందుకు పాలకులు జాగ్రత్తలు తీసుకోనపుడు సామాన్య మానవుడు ఆకలితో అలమటించి ఆక్రోశిస్తున్నప్పుడు ఆ వ్యవస్థలో మార్పు కోరడం నేరమా?

—సి ప్రకాష్



సి హెచ్ మధు

"నేను సత్యమే పలుకుతాను. అబద్ధమాడను" అన్నాడు భగవద్గీత ముందు పెట్టగానే బోనులో నిల్చున్న ముద్దాయి ప్రకాశ్.

గ్యాలరీలో కూర్చున్న ప్రజలు కొంచెం నివ్వెరపోయినట్టు చూచారు.

కోర్టు హాలంతా ప్రేక్షకులతో నిండి వుంది. ఒక వూరుకు వూరే తరలి వచ్చి గ్యాలరీలో కూర్చుంది.

ఎత్తయిన కుర్చీపైన నల్లకోటు వేసుకొన్న జడ్జి కూర్చున్నాడు. తెల్ల కళ్ళద్దాలు ధరించాడు. పైకి చూసుకొన్నాడు, చేతిలో కలముంది. ఆయనపైన రాష్ట్రపతి ఫొటో వుంది

హాలులో పైన నాల్గు పంకాలు తిరుగుతున్నాయి.

మధ్యన నలుగురు వకీల్లు నల్లకోట్లు వేసుకొని కూర్చున్నారు.

"ఎవరైనా వకీలు కావాలా?" ప్రశ్నించాడు బోనులో వున్న ముద్దాయి ప్రకాశ్‌ను జడ్జి.

"అవసరం లేదండీ!" అన్నాడు ప్రకాశ్.

ముద్దాయి ప్రకాశ్ ముఖంలో ఏ విచారమూ లేదు. పెదవులపైన సన్నటి చిన్న నవ్వు! పరీక్షగా చూచేవారికి కనిపించిగలదు. నేరోషర్టు వేసుకొన్నాడు. ధోవతి కట్టుకొన్నాడు. వెంట్రుకలు దూసినట్టుగా వున్నాయి కాని నూనె లేక పంకా గాలికి పైపైకి ఎగురుతున్నాయి.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రశ్నించటం ప్రారంభించాడు.

"మీ పేరు?"

"ప్రకాశ్."

"మీ వూరు?"

"అరుణాపూర్."

"ఏమి పని చేస్తారు?"

"వ్యవసాయం."

"మీ వూరిలో యువజన సంఘముందా?"

"వుంది."

"యువజన సంఘంలో ఏ పదవిలో వున్నారు?"

"అధ్యక్షులుగా వున్నాను."

"ఎవరైనా ఎలెక్ట్ చేసారా?"

"వూరు యువకులంతా అందులో సభ్యులు. వారే నన్ను ఎన్నుకొన్నారు."

"రిజిష్టేషన్ అయిందా?"

"కాలేదు."

"ఇప్పుడున్న సర్పంచిని, ఆయన వర్గాన్ని కావాలని అప్రతిష్ట చేయటానికి మీరు వర్గముగా ఏర్పడి యువజన సంఘంగా పన్నాగం పన్నారని నేనంటాను మీరేమంటారు?" అన్నాడు ప్రకాశ్ కళ్ళల్లోకి చూస్తూ పబ్లిక్ ప్రాసిక్యూటర్

"అబద్ధం" అన్నాడు కోపంతో, కళ్ళల్లోకి చూస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ కళ్ళల్లోకి చూస్తూ ప్రకాశ్.

"మీ వూరిలో కంట్రోల్ షాపుందా?"

"వుంది."

"ఎవరు నిర్వహిస్తారు?"

"శంకరయ్య"

"మే ఇరవైన శంకరయ్య దుకాణం వద్దకెళ్లావా?"

"వెళ్లాను"

"ఎందుకెళ్లావ్?"

"కంట్రోలు ధాన్యాన్ని సరిగా పంచమని చెప్పటానికి"

"చెప్పారా?"

"చెప్పాం"

"కాదు. అబద్ధం. పోగానే మీరా దుకాణాన్ని లూటీచేసారు" అరిచాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.


"నిజమే కాదు పోగానే దుకాణాన్ని దోయలేదు. చాలా సేపు నచ్చచెప్పిన తర్వాత—పంచటానికి ఆయన అంగీకరించకపోతే—గత్యంతరంలేని పరిస్థితిలో దుకాణంలోని సరుకు బయటకుతీశాం" అన్నాడు శాంతంగా ప్రకాశ్.

"దోపిడీకి నాయకత్వం వహించారా?"

"అది దోపిడీకాదు ఆపొక ఉద్యమము"

"మీరు నాయకత్వం వహించారా?"

"అందులో నేనొకడిని నాయకత్వం ప్రసక్తే లేదు"




జడ్జిదెసకు తిరిగి పబ్లిక్ ప్రాసిక్యూటర్ "మైలార్డ్! ఈయన యువజన సంఘం అధ్యక్షుడు. ఆనాడు దుకాణాన్ని దోపిడీ చేసినపుడు ఉన్నానని అంగీకరిస్తున్నాడు. అందులో భాగం పంచుకొన్నానని అంగీకరిస్తున్నాడు. కాని దుకాణదారు తన సాక్ష్యములో ఈయన నాయకత్వం వహించాడని, ఈయన ఆర్డర్ పైననే ఈ దోపిడీ జరిగిందని తేలింది. చూసినవారి సాక్ష్యంలోకూడా ఈయనే నాయకుడని స్పష్టంగా ఉంది. ఈయన అంగీకరించినంతమాత్రాన నిజం అబద్ధం కాదు వూరిలో ప్రతిష్ఠ పెంచుకోవాలని, ఉద్యమము పేరుతో దోపిడీకి నాయకత్వం వహించివూరిలో అరాచకత్వాన్ని సృష్టించాడు. యువకులను తప్పుదారి పట్టిస్తున్నాడు. మైలార్డ్, శాంతికి భంగం కలిగిస్తున్న ఈలాంటివారు దేశానికి చీడపురుగులు. ఈలాంటివారు ఉండటం దేశాభ్యుదయానికి దెబ్బ. వీరికి కఠిన శిక్ష విధించమని కోరుతున్నాను."

గ్యాలరీలో వున్న వారెవరో "అబద్ధం శిక్షవద్దు" అరిచారు. గలభా కొంత ప్రారంభమైంది.

"ఆర్డర్! ఆర్డర్" అన్నాడు జడ్జి

కోర్టంతా నిశ్శబ్దం ఆవరించింది.

జడ్జి ప్రకాశ్ దెసకు తిరిగి "మీరేమైనా చెప్పదలచారా?" అడిగాడు.

"నేనో ప్రకటన చేస్తాను"

"చేయండి!"

"మాది అరుణాపూర్. వెయ్యి జనాభా వున్న పల్లె రెండువందల యిళ్లుంటాయి. మావూరికున్నదల్లా ఒకేఒక దుకాణము. దాని సొంతదారు శంకరయ్య కరువొచ్చింది ధాన్యం ధరలు పెరిగాయి గవర్నమెంటువారు చక్కెర, గోధుమ, బియ్యం కంట్రోలుద్వారా యిస్తామని ప్రకటించగానే ఆ కంట్రోలు షాపును తనకనుకూల వ్యక్తియైన వ్యాపారి శంకరయ్య కిప్పించారు. ఆనాడే మాయువజన సంఘంవారు అబ్జెక్షన్ చేసారు. దుకాణాదారు శంకరయ్య

కింతవరకు ఒక స్వంత దుకాణముంది వారికి కంట్రోలు షాపు యివ్వటము వలన అవకతవకలు జరిగే ప్రమాదముంది ఈ విషయం లెటరుద్వారా సర్పంచుకు తాసీల్దారుకు తెలిపాం. మా అభ్యంతరాన్ని త్రోసిపుచ్చి ఈ షాపూ శంకరయ్య కప్పగించారు. కంట్రోలు షాపు వ్యాపారి శంకరయ్య కప్పగించి ఆరునెలలయ్యింది. ఒకనెలలోనైనా—చక్కెరకానీ, బియ్యం కానీ, గోధుమకానీ ఎవ్వరికీ యియ్యలేదు. పదిసార్లు అడిగాము. ఒకసారి కోటా రాలేదంటాడు. ఒకసారి కోటా పంచామంటాడు. పంచినట్టుగా ఆధారాలు చూపించమంటే - నీవెవరంటాడు. సర్పంచుకు ఫిర్యాదుచేస్తే నిర్లక్ష్యం చేసారు. అసలే అడుగలేదు. తాసీల్దార్ గారికి కంప్లయింటు చేస్తూ ఎన్నో లెటర్లు వ్రాసాం యిందుకు సంబంధించిన లెటర్సు రెసిప్ట్సు మీకు దాకలా చేస్తున్నాను" అంటూ జడ్జిగారికిచ్చాడు ప్రకాష్.

"తాసిల్దారుకూడా ఎన్నడూ మా లెటర్లకు సమాధానమివ్వలేదు ఇంతలో బజారు ధరలు చాలా పెరిగాయి చక్కెర కంట్రోలుకంటె రెట్టింపు బియ్యం అకస్మాత్తుగా కిలోకు అర్ధరూపాయి, పెంచారు గోధుమ వ్యాపారం ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటామని ప్రకటించగానే బజారులో గోధుమలు మాయమయ్యాయి. ఈ దశలో కష్టజీవి సామాన్యుడు బజారులో కొనలేని పరిస్థితిలో పడ్డాడు, మొన్న నెల ఫస్టు వీక్ లో కంట్రోల్ షాపుకు, చక్కెర, బియ్యం, వచ్చాయి. లోపల పర్చారు. యువజన సంఘం మెంబర్సుమంతా వెళ్ళి పంచమన్నాము. పంచనన్నాడు. ఏమిచేస్తారో చేసుకోమన్నాడు. నోటి కొచ్చినట్టుగా కూశాడు. గత్యంతరంలేని పరిస్థితిలో యువజన సంఘం మెంబర్సమంతా-కంట్రోలు బియ్యాన్ని గోధుమ, చక్కెర బయటకు తీసి పబ్లిక్ కు అమ్మాము"

'కాదు అమ్మలేదు మీరు పంచుకొన్నారు" అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్

"ఒకరిని దోచుకోవటం మా లక్ష్యం కాదు కష్టజీవులము. మేమూ పనిచేయలేము ధాన్యాన్ని అందరికీ అమ్మాం. అయితే అమ్మినడబ్బులు తీసుకోవడానికి నసేమిరా శంకరయ్య నిరాకరించి — పోలీసుల్ని పిలిపించి మమ్మల అరెస్టు చేయించాడు"

"ఆ డబ్బులెక్కడున్నాయి?" ప్రశ్నించాడు జడ్జి

"ఆ శంకరయ్య దుకాణములోనే ఒక సంచిపైన ఆ డబ్బులున్నాయి మమ్మల్ని అరెస్టుచేయగానే ఆడబ్బులప్రసక్తికే రాకా అక్కడే విడిచిపెట్టి పోలీసువాళ్ళ వెంట వచ్చాము"

"మైలార్డ్! ఇది అబద్ధం. అసలు ఆ నాడు పైసలప్రసక్తేరాలేదు" అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్

"వ్యాపారి శంకరయ్యను బోను ఎక్కించండి!' అన్నాడు ప్రకాష్

శంకరయ్యనుబోనుఎక్కించారు.

"యువజన సంఘంవారు అమ్మిన పైసలు మీరు తీసుకోవటానికి నిరాకరించారా?" అడిగాడు జడ్జి

"లేదు. ఆ విషయమేలేదు. ఈప్రకాశే అందరికీ దోసెలతో పంచాడు"

"నిజం చెప్పండి శంకరయ్యగారూ ఇందులో పోయిందేమీలేదు" అన్నాడు ప్రకాశ్

"నిజమే మీరే దోసిలితో పంచారు"

"తీసుకొన్న వారిని బోనెక్కించండి" అన్నాడు ప్రకాశ్.

"అది తర్వాత విషయం. ఇంకేమైనా చెప్పదలచారా?" అడిగాడు జడ్జి.

కోర్టు నిశ్శబ్దంగా వుంది. మల్లెపూవు క్రిందపడ్డా వినిపించగలిగే స్థితిలో వుంది.

ప్రకాశ్ మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

"గౌరవనీయులయిన జడ్జీగారూ! పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారు ఆరోపించినట్టుగా యిది దోపిడీ కాదు. గత్యంతరం లేని పరిస్థితిలో జరిపిన ఒక చర్యమాత్రమే. ఆత్మ రక్షణార్థం కాల్పులు జరుపటమేలాంటిదో యిది ఆలాంటిదే. మేము అరాచకాన్ని సృష్టించటం లేదు. ఉన్న వాళ్లు సృష్టిస్తున్న అరాచకం నుండి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నాము. యువకులను తప్పుదారి పట్టిస్తున్నామనటం సరియైనది కాదు. మనలాంటి మేధావులు తప్పుదారి పట్టినపుడు, యువకులు మన చేతులు పట్టి లాగుతున్నారా? అనిపిస్తుంది శాంతికి భంగం కలిగించటం లేదు. మా హృదయాలలో వున్న అశాంతిని బయట పెడుతున్నాము. మేము చీడపురుగుల ఏరటానికి ప్రయత్నిస్తున్న వారిమే కాని చీడపురుగులము కాము. మమ్మలను. మా చర్యను అర్థం చేసుకోమ్మని కోరుతున్నాను."

"బయట బియ్యం దొరకటం లేదా?" జడ్జి ప్రశ్నించాడు.

"దొరుకుతున్నాయి."



"బయట చక్కెర దొరకటం లేదా?"

"దొరుకుతుంది."

"బయట గోధుమలు దొరకటం లేదా?"

"దొరకటం లేదు గోధుమ స్వాధీనానికి ప్రభుత్వం పూనుకోగానే బజారులో గోధుమ మాయమైంది" అని కొంచంసేపు నిశ్శబ్దం వహించిన ప్రకాశ్ జడ్జి ప్రశ్నల లోని అర్థాన్ని గ్రహించి "తాసీల్దార్‌గారు నిజంగా చర్య తీసుకొంటే — మా లెటర్లకు ప్రాముఖ్యతనిస్తే — మేమీ పని చేయవల్సిన అవసరం రాకపోయేది' అన్నాడు.

'మైలార్డ్! తాసీల్దార్‌గారు నిజం తెల్సుకోవాలని సర్పంచుకు లెటరు వ్రాసాడు. సర్పంచు కంట్రోల్ షాపులో లోపాలేమీ లేవని తాసీల్దార్‌గారికి జవాబు వ్రాసారు. అందుకు సంబంధించిన పత్రాలు కోర్టుకు దాకలా చేస్తున్నాను' అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"అసలు నిజమేమిటంటే—కంట్రోలు ధాన్యాన్ని బ్లాకులో అమ్మి వచ్చినలాభంలో సర్పంచుకు, తాసీల్దార్‌కు వాటా యిస్తున్నాడు శంకరయ్య. మేమా ధాన్యాన్ని అమ్మి పైపలిస్తే తీసుకోకుండా అరెస్టు ఎందుకు చేయించాడంటే కంట్రోలు ధాన్యాన్ని ఇక ముందు తప్పని సరిగా అమ్మవలసి వస్తుందని—తనకు లాభాలు రావని. యిక ముందు ఎవరూ ఎదురు తిరుగ కూడదని అందుకే కోమటి శంకరయ్యకు సర్పంచు, తాసిల్దార్ మద్దతు కూడా వుంది," అన్నాడు ప్రకాశ్

కేసు వాయిదా పడింది.

* * *


ప్రియమిత్రుడు భాస్కర్‌కు,

ఈ లెటరు జైలు నుండి వ్రాస్తున్నాను. నాకు కోర్టు ఆరు మాసాల కఠిన కారాగార శిక్ష విధించింది. ఎందుకో తెలుసా? ఉద్యమము పేరుతో దోపిడీ నిర్వహించానని ఫిర్యాదు కాని ఆ మాటతో నేను అంగీకరించలేను. దోపిడీని అరికట్టటానికి చేసిన ప్రయత్నమే కాని అది దోపిడీ కాదు. అయినా కంట్రోల్ ధాన్యాన్ని పూరికే ఎవరికీ పంచలేదు. అందరికీ అమ్మాము. వచ్చిన డబ్బులు తీసుకోకుండా మేమంతా ధాన్యాన్ని దోపిడీ చేసి పంచామని వ్యాపారి శంకరయ్య పిర్యాదు. ఆ మాట పోలీసులు నమ్మారు. కోర్టు నమ్మింది. నా మాట, ధాన్యం తీసుకొన్న వారిమాట కోర్టు తిరస్కరించింది ఆకలిగా వున్న వాడు అబద్ధమాడుతాడు. కడుపునిండిన వాడు అబద్ధ మెందుకాడుతాడు. పేదవాడు దొంగతనం చేస్తాడు. ఉన్న వాడెందుకు చేస్తాడు. ఇది కోర్టు విశ్వాసం (నా కేసులో)

జడ్జి గారంటారు "లా అండ్ ఆర్డర్‌ను మీ చేతుల్లోకి తీసుకోవటం తప్పని" నిజమే అంగీకరిస్తాను. అది తప్పే, అయితే అలాంటి పరిస్థితుల్ని పాలక

వ్యవస్థ కొని తెచ్చుకోవటం తప్పు కాదా? మేము చేసిన పని చట్ట విరుద్ధమని అంగీకరిస్తాను, కాని తప్పంటే అంగీకరించను. చట్టవిరుద్ధం తప్పు కాదా? అంటారు కొందరు. చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన పరిస్థితులు అంచనాలోకి తీసుకోవాలి ప్రజలు చట్ట విరుద్ధంగా ప్రవర్తించే పరిస్థితులు పాలక వ్యవస్థ రాకుండా చూచుకోవాలి. అంటే ఆయుధాలతో కాదు ఆచరణలో చూపాలి. పాలక వ్యవస్థ ప్రజల హృదయాలలో అశాంతిని సృష్టించినపుడు (కావాలని సృష్టించకపోయినా అలాంటి పరిస్థితులు అదుపులోకి తేకపోతే) ప్రజలు ఆ అశాంతిలో బాధ పడలేరు. ఆ అశాంతిని బయట సృష్టిస్తారు. తీర్పులో వుంది, 'బయట సరుకు విచ్చలవిడిగా అమ్ముతున్నపుడు కంట్రోలు షాపులోని ధాన్యాన్ని బలవంతంగా తీసుకోవటం దోపిడీ అని. నిజమే కానీ, బయట ధరలు విచ్చలవిడిగా వున్నపుడు వాటిని ప్రభుత్వం అదుపులో పెట్టనపుడు ఆ ధరలతో ప్రజలు కొనగలిగే స్థితిలో లేనపుడు తనకు రావల్సిన సాధ్యమయిన ధాన్యం న్యాయమయిన రేటుకు ప్రభుత్వం యిప్పించలేనపుడు, ప్రజలేమి చేయాలి?

ఒక దిక్కు ఆకలి, ఒక దిక్కు చట్టం సంఘర్షణలో ఏదో ఓ దిక్కు అడుగు వేశాను. తప్పు అడుగు వేశానంది కోర్టు. శిక్ష విధించింది.




నా కనిపిస్తుంది సమస్యల పరిష్కారానికి పాలక వ్యవస్థ ఆలోచనలో పెద్ద మార్పు రావాలని, అయితే —

పాలితుల సౌకర్యాలను, వారి కనీసావసరాలు తీర్చేందుకు పాలకులు జాగ్రత్తలు తీసుకోనపుడు సామాన్య మానవుడు ఆకలితో అలమటించి ఆక్రోసిస్తున్నప్పుడు ఆ వ్యవస్థలో మార్పు కోరడం నేరమా?

—సీ ప్రకాశ్.